## శ్రీశైలం ప్రసాదంలో ఎముక ప్రత్యక్షం అవాస్తవం

- **ఆలయ ప్రధానార్చకులు వెల్లడి**

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైల భ్రమరాంబికాదేవి అమ్మవారి పులిహోర ప్రసాదంలో ఎముక ప్రత్యక్షమైందంటూ జరిగిన ప్రచారం అవాస్తవమని ఆలయ ప్రధానార్చకులు మార్కేండయ శాస్త్రి, వేదపండితులు గంటి రాధాకృష్ణశర్మ తెలిపారు. పాకశాలలో తయారు చేసే రోజువారీ ప్రసాదాలు నియమనిష్ఠలతో, శుచీశుభ్రతలతో ప్రధానార్చకుల పర్యవేక్షణలో జరుగుతాయని వెల్లడించారు. శ్రీశైల క్షేత్ర ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు, భక్తుల మనోభావాలను కించపరిచేందుకే ఇలాంటి వార్తలు వస్తున్నాయని, వీటిని ఎవరూ నమ్మొద్దని కోరారు. పులిహోర ప్యాకెట్‌లో కనిపించిన గుర్తు తెలియని వస్తువులను ఎముకలుగా భావించి ఓ భక్తుడు ఫిర్యాదు చేశారని తెలిపారు.

## 15 నుంచి వన్ డిస్ట్రిక్ వన్ ఎగ్జిబిషన్

- **వన్ డిస్ట్రిక్ వన్ ఎగ్జిబిషన్**

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): గ్రామీణాభివృద్ధిలో అట్టడుగున ఎదురయ్యే సవాళ్లను పరిష్కరించే ఆవిష్కరణల ప్రదర్శనను ఈ నెల 15, 16, 17 తేదీల్లో నిర్వహించనున్నట్టు తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ప్రతినిధి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాలో మూడు రోజుల పాటు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ ప్రదర్శనలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. టీఎస్ఐసీ 'వన్ డిస్ట్రిక్ వన్ ఎగ్జిబిషన్' పేరిట చేపట్టే ఈ ప్రదర్శనలో వ్యవసాయం, నీటి పారుదల, వ్యర్థాల నిర్వహణ, పాడి పరిశ్రమ వంటి అంశాల్లో ఔత్సాహికులు రూపొందించిన ఆవిష్కరణలు ఉంటాయని వివరించారు.

## బయోఏషియా సదస్సుకు హోస్ట్‌లుగా 5 దిగ్గజ కంపెనీలు

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 నుంచి 28 వరకు హెచ్ఐసీసీలో నిర్వహించనున్న ప్రతిష్ఠాత్మక బయోఏషియా 21వ సదస్సులో తొలిసారి 5 దిగ్గజ కంపెనీలు భాగస్వామ్యమవుతున్నాయి. ఈ సదస్సుకు హోస్ట్‌లుగా వ్యవహరించేందుకు నోవార్టిస్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, బ్రిస్టల్ మేయర్స్ స్క్విబ్, లారస్ ల్యాబ్స్, సాయి లైఫ్‌సైన్సెస్ కంపెనీలు ముందుకొచ్చినట్టు నిర్వాహకులు వెల్లడించారు. లైఫ్‌సైన్సెస్ రంగంలో భారత్‌ను, తెలంగాణను ప్రపంచ కేంద్రంగా నిలబట్టే లక్ష్యంతో ఈసారి బయోఏషియా సదస్సు జరగనున్నది.

## వీసీ పోస్టులకు 280కిపైగా దరఖాస్తులు

**ముగిసిన దరఖాస్తుల గడువు • కోడ్ ముగిశాకే నియామకాలు**

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో వైస్‌చాన్స్‌లర్ల నియామకానికి దరఖాస్తుల గడువు సోమవారంతో ముగిసింది. రాష్ట్రంలోని 10 వర్సిటీల వీసీ పోస్టులకు 280 దరఖాస్తులు వచ్చాయి. కొందరు పోస్టల్ ద్వారా పంపుతుండటంతో వీటి సంఖ్య మరింత పెరిగే అవకాశమున్నది. వీసీల నియామకానికి విద్యాశాఖ గత నెల 27న నోటిఫికేషన్ విడుదల చేసింది. తుది గడువు అయిన సోమవారం సాయంత్రం 5 గంటల వరకు 280కిపైగా దరఖాస్తులు వచ్చినట్టు తెలిసింది.













